సాక్షి తిరుపతి

బుధవారం । 29 । జనవరి । 2025



గజ బీభత్సం

చంద్రగిరి మండలంలో సోమవారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. పంట పొలాలను ధ్వంసం చేసింది. - 8లో



జీఎస్ఎల్వీ ఎఫ్15 కౌంట్‌డౌన్

శ్రీహరికోట షార్ నుంచి బుధవారం జీఎస్ఎల్వీ ఎఫ్15 రాకెట్‌ను రోదసీలోకి ప్రయోగించనున్నారు. - 8లో



కూతురే కొడుకై..

వెంకటగిరి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య అంత్యక్రియలను ఆయన కుమార్తె ధరణి నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

స్మార్ట్ సిటీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : తిరుపతి స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి ఎస్ఈసీ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులకు ఎప్పటికప్పుడు నిధులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న పనులను నాణ్యతతోపాటు వేగవంతం చేయాలని తెలిపారు. సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈసీ ప్రతినిధులు ప్రదీప్, జమాల్, అంబర్, ఫణి కుమార్, కెల్ట్రాన్ సతీష్, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, చంద్రా రెడ్డి, హేమ, ఎస్ఈ శ్యాంసుందర్, ఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ అధికారి బదిలీ



చెన్నయ్య, వెల్ఫేర్ అధికారి

తిరుపతి అర్బన్ : జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి చెన్నయ్య మంగళవారం చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఆయన 2022 నుంచి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉత్తమ సేవలు అందించి మూడేళ్లలో ఆరు పర్యాయాలు అవార్డులు అందుకున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి విక్రమ్ కుమార్‌ను తిరుపతికి బదిలీ చేశారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

టెక్నాలజీపై పట్టు అవసరం



టెక్ ఫెస్ట్‌కు హాజరైన విద్యార్థినులు

తిరుపతి సిటీ : ఆధునిక టెక్నాలజీపై విద్యార్థులకు పట్టు అవసరమని చెన్నై సవిత యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎమ్ఎస్ శరవణన్ తెలిపారు. మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో సెలెస్ట్రా-2025 పేరుతో రెండురోజుల టెక్‌ఫెస్ట్ ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శరవణన్ మాట్లాడుతూ విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు నూతన టెక్నాలజీ, పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. టెక్నోఫెస్ట్‌తో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ మేధోశక్తిని, ఐడియాలను పంచుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. రిజిస్ట్రార్ రజనీ మాట్లాడుతూ విద్యార్థినులలోని సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించడమే సెలెస్ట్రా టెక్ ఫెస్ట్ ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ప్రొఫెసర్ మల్లికార్జున, సీఎస్ఈ హెడ్ ప్రొఫెసర్ సరిత, కన్వీనర్ డాక్టర్ సాయి లోహిత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గూడు.. గోడు!



అడుసుపాళెంలో ఆగిన ఇళ్ల నిర్మాణం

పేదల గూడు ఘోషిస్తోంది. ప్రభుత్వం నిర్లక్ష్యంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. రాజకీయ వికృత క్రీడలో పావుగా మారి విలపిస్తోంది. పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరుతోంది. పిచ్చిమొక్కల నడుమ దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. బడుగుల సొంతింటి కల గాలిలో దీపంగా మారిపోయింది. ఈ క్రమంలో లబ్ధిదారులు తీవ్రంగా మండిపడుతున్నారు. పక్కా గృహాలపై కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్లు కేటాయించారని గుర్తుచేస్తున్నారు. నిర్మాణ పనులకు సైతం ఆర్థికసాయం అందించారని వెల్లడిస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి.. వేలాది నివాసాలను శరవేగంగా పూర్తి చేయించారని ప్రశంసిస్తున్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక ఎక్కడి పనులు అక్కడే నిలిపేశారని వాపోతున్నారు. జగనన్న కాలనీలకు ఎన్టీఆర్ పేరు పెట్టడం మినహా చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు పైసా కూడా వెచ్చించలేదని విమర్శిస్తున్నారు.

జగనన్న కాలనీల్లో ఆగిపోయిన పనులు

- పక్కా ఇంటి నిర్మాణాలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎన్టీఆర్ కాలనీలుగా పేరు మార్చి చేతులుదులుపుకున్న వైనం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో 77,765 ఇళ్ల మంజూరు
- ప్రతి నెలా వెయ్యికి పైగా పూర్తయిన ఇళ్లు
- ప్రస్తుత కూటమి పాలనలో 8 నెలలకు 2,041 గృహాలకు మాత్రమే మోక్షం
- నాడు రూ.798.87 కోట్ల చెల్లింపులు
- నేటి వరకు పైసా వెచ్చించని కూటమి సర్కారు

పేరు మార్చి.. పనులు ఆపేసి

పేదల ఇంటి నిర్మాణాలను కూటమి సర్కార్ చిన్నచూపు చూస్తోంది. చివరికి పక్కా ఇళ్ల విషయంలోనూ రాజకీయాలు చేయడం ఏంటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. జగన్నన కాలనీలను ఎన్టీఆర్ గృహాలుగా పేరు మార్చడం తప్ప ప్రభుత్వం ఏమీ చేయలేదని బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తోంది. ఇప్పటి వరకు గత వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో ఇంటి నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లను తప్పించి..తమ వారికి కాంట్రాక్ట్‌లు ఇప్పించారు. అయితే పనులు మాత్రం చేపట్టలేదు. ఆయా కాలనీల్లో ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్టే ఉంది. దీనికి తోడు జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ పాలసీ కింద ఉచిత ఇసుక లభించడం లేదు. దీంతో ఇంటి నిర్మాణాలకు బ్రేక్ పడక తప్పలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

తిరుపతి అర్బన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 575 జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. సుమారు 77,765 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. లేఅవుట్‌లలో మౌలిక వసతులు కల్పించారు. పేదల ఇళ్ల నిర్మాణానికి చేయూతనందించారు. కేవలం రెండేళ్లలోనే 24,618 ఇళ్లు పూర్తి చేయించి లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించారు. మిగిలిన గృహాలను సైతం వివిధ దశల్లోకి తీసుకువచ్చారు. ఇందుకు గాను రూ.792.52 కోట్లు ఖర్చు పెట్టారు. 2025 మార్చి 31వ తేదీకి వందశాతం గృహాలు పూర్తి చేయాలనే లక్ష్యాలను నిర్దేశించారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికల వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో పేదలందరికీ గూడు కల్పించాలనే మహోన్నత ఆశయం నీరుగారిపోయింది. గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ నెల 27వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా కేవలం 2,041 ఇళ్లు మాత్రమే పూర్తి చేయడం గమనార్హం.

రద్దు చేస్తామనడం దారుణం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన స్థలాల్లో ఇంటి నిర్మాణం చేపట్టకపోతే రద్దు చేస్తామని చెప్పడం దారుణం. ఆర్థిక ఇబ్బందులతో పనులు ప్రారంభించని వారికి సాయం అందించాలి. వారు ఇల్లు కట్టుకునేందుకు ప్రోత్సహించాలి. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని చెప్పారు. ఆ మాట నిలబెట్టుకోవాలి. అంతే కానీ పట్టా రద్దు చేస్తామని భయపెట్టడం సరికాదు.

– శివకవి ముకుంద, సీపీఎం నేత, నాయుడుపేట

బిల్లులు ఇవ్వడం లేదు



కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. మా గ్రామానికి సమీపంలోనే జగనన్న కాలనీలో ఇంటి పట్టా ఇచ్చారు. ఆ మేరకు ఇల్లు కట్టుకుంటున్నాం. అయితే సార్వత్రిక ఎన్నికల ముందు ఒక బిల్లు ఇచ్చారు. ఎన్నికల తర్వాత మాకు బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో ఇంటి నిర్మాణం ఆపేసుకోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి. –అంకమ్మ, చిట్టేడు, కోట మండలం

అంధకారంలో బతుకుతున్నాం



జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నాం. అయితే మాకు వీధిలైట్లు లేకపోవడంతో అంధకారంలోనే బతుకుతున్నాం.మరోవైపు రోడ్లు సక్రమంగా లేవు. వర్షం వస్తే నానా ఇబ్బందులు పడుతున్నాం. మురుగునీరు వెళ్లడానికి వీలుగా కాలువలు లేవు. దీంతో దోమల బెడద తప్పడం లేదు. జ్వరాల బారిన పడుతున్నాం. మా కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాం. – నవ మల్లిక, రేణిగుంట

ఆందోళనతో ఆపేశాం



మాకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి పట్టా ఇచ్చారు. అయితే అప్పట్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటిని నిర్మించుకోలేదు. తాజాగా గృహ నిర్మాణం కోసం బేస్‌మెంట్ వేయడానికి గుంతలు తవ్వుకున్నాం. అయితే మా కాలనీలో పలువురు బిల్లులు రావడం లేదని చెప్పారు. దీంతో సకాలంలో బిల్లులు వస్తాయో రావో...అనే ఆందోళనతో పనులు ఆపేశాం. – ఏసు, కాలమనాయుడుపేట, సత్యవేడు మండలం

జాప్యం లేకుండా చూస్తాం



ఇంటి నిర్మాణాలు, బిల్లులు మంజూరు చేయించడంలోను జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. ఇసుక సమస్య లేకుండా ఏర్పాట్లు చేస్తాం. కొత్తగా జిల్లాకు వచ్చా. అన్ని అంశాలను పరిశీలన చేస్తున్నా. లోటుపాట్లు ఉంటే సవరిస్తా. ఇంటి నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తా. ఎవరికి కేటాయించిన ప్లాట్లలో వారు ఇంటి నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు రావాలి. లబ్ధిదారులకు పూర్తిగా సహకరిస్తా. – పి. దయాకర్, జిల్లా అధికారి, గృహనిర్మాణశాఖ

జీపాళెంలో ఇసుక కొరతతో ఆగిన నిర్మాణ పనులు





శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,278 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,077 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.70 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

పురస్కారాలకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారి నుంచి సేవా భూషణ్, విద్యా భూషణ్ జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 9వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే వార్షికోత్సవంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విజయం మనదే

- డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా శేఖర్‌రెడ్డి
- విప్‌గా రాధాకృష్ణారెడ్డి నియామకం



మాట్లాడుతున్న భూమన, పక్కన ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, అభినయ్‌రెడ్డి, జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి నగర పాలక సంస్థలో విజయమ మనదే అని, వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతుందని పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డితో కలిసి కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 42వ డివిజన్‌కు చెందిన ఎం.శేఖర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే కౌన్సిల్‌లో విప్‌గా 1వ డివిజన్‌కు చెందిన ఆదం రాధాకృష్ణారెడ్డిని నియమించారు. భూమన మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా, కష్టకాలంలో కూడా మేము మీ వెంటే ఉన్నామంటూ కార్పొరేటర్లు మా కుటుంబ సభ్యులుగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. మహానేత వైఎస్సార్, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ధైర్యంగా పోరాటం సాగిస్తామని వెల్లడించారు. ఇటీవల జరిగిన తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించేందుకు జగనన్న వస్తే స్వచ్ఛందంగా తరలివచ్చిన జనసమూహాన్ని చూసి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు దిమ్మతిరిగిందని తెలిపారు. సమావేశంలో 30 మంది కార్పొరేటర్లు పాల్గొన్నారు. మరో ముగ్గురు కార్పొరేటర్లు సొంత పనుల నిమిత్తం బయట ఉన్నారని నేతలు వెల్లడించారు.

ముంచిన మంచు

జిల్లాలో మామిడి సాగు చేపట్టిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కొంత పూత రాలిపోయింది. దీనికితోడు దట్టమైన మంచు కారణంగా మిగిలిన పూత మాడిపోయి నేలపాలవుతోంది. అక్కడక్కడ నిలిచింది కూడా విరబూయని దుస్థితి దాపురించింది. ఇప్పటికే సస్యరక్షణ చర్యలకు రూ.వేలు వెచ్చించిన రైతాంగం దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. వివిధ రకాలు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే రూ.లక్షలు వెచ్చించి తోటలు కొనుగోలు చేసిన వ్యాపారుల్లో కలవరం మొదలైంది.



రామచంద్రాపురం మండలం నెత్తకుప్పంలో మామిడి చెట్టుకు సోకిన ఫంగస్ వైరస్‌ను చూపుతున్న రైతులు

- నీరుగారుతున్న మామిడి రైతుల ఆశలు
- వాతావరణ మార్పులతో విరబూయని పూత
- దిగుబడిపై తీవ్రమైన ప్రభావం
- తోటలు కొనుగోలు చేసిన వ్యాపారుల కలవరం
- పూత రక్షణకు అన్నదాతల ఆపసోపాలు

తిరుపతి రూరల్: మామిడి తోటలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో తిరుపతి ఒకటి. ప్రధానంగా చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో 2019 నుంచి 2024 వరకు జిల్లావ్యాప్తంగా రైతులు మామిడి తోటల వైపు మొగ్గుచూపారు. భారీగా రాయితీలు అందించడంతో మామిడి తోటలు విస్తరించాయి. అప్పట్లో వాతావరణం సైతం రైతులకు అనుకూలించడంతో మంచి దిగుబడులు సాధించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాయితీలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే వాతావరణ పరిస్థితులు సైతం వికటించాయి. దీంతో ఇప్పటివరకు జిల్లాలోని 30 శాతం తోటల్లో కూడా పూత రాలేదు.

ఆశ..నిరాశ

జిల్లాలో సాగు చేస్తున్న మామిడి రకాల్లో తోతాపురి తోటలే అధికం. దాదాపు 70శాతం నుంచి 80శాతం వరకు ఈ తోటలే ఉన్నాయి. తోతాపురికి ఓ ప్రత్యేకత ఉంది. ఇవి ఓ ఏడాది బాగా పండితే.. మరో ఏడాది సరిగా కాపునకు రావు. గత సీజన్‌లో తోతాపురి రకం సక్రమంగా దిగుబడి రాలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అయితే వారికి నిరాశే మిగిలింది. డిసెంబర్‌లో అకాల వర్షాలు కురవడం, దీనికితోడు తీవ్రమైన మంచు పడుతుండడంతో పూత ఆలస్యమైంది. వచ్చిన పూత కూడా బూడిద తెగులు సోకి రాలిపోతోంది. సాధారణంగా పూత బాగా వస్తే ఎకరాకు 7 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ పర్యాయం వాతావరణ ప్రతికూలత కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూత నిలిచేనా..?

జిల్లాలో 15 రోజుల నుంచి తేనె మంచు ఎక్కువగా కురుస్తోంది. దీంతో మామిడి తోటలు పూతకు రావడం లేదు. ఇప్పటికే రైతులు రెండుసార్లు మందులు పిచికారీ చేశారు, తెగుళ్లు రాకుండా ఉన్న పూత నిలబడడానికి బావిస్టన్ వంటి మందులు సైతం వాడారు. ఒకసారి సస్య రక్షణ చర్యలు చేపట్టడానికి ఎకరాకు రూ.7వేల వరకు వెచ్చించారు. ఉన్న పూతను నిలబెట్టుకోవడానికి రైతులు, వ్యాపారులు ఆపసోపాలు పడుతున్నారు. మూడో పర్యాయం కూడా తోటలకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికీ తేనె మంచు కురుస్తుండడంతో ఉన్న పూత కూడా నిలబడుతుందో లేదో అని మామిడి రైతులు, వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు.



చిన్నగొట్టిగల్లు మండలంలో చెట్లకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

జిల్లా సమాచారం

మామిడి సాగు విస్తీర్ణం	55 వేల ఎకరాలు
రైతులు	19,533
ఏటా దిగుబడి	సుమారు 2,18,800 టన్నులు

సాగులో ఉన్న రకాలు (ఎకరాల్లో)


తోతాపురి : 32,400	బేనీషా : 8250
నీలం : 6,290	ఇతర రకాలు : 8,060

పూత రాలిపోతోంది



గత ఏడాది మామిడి దిగుబడి సరిగా లేదు. పూత కూడా సక్రమంగా రాలేదు. ఈఏడాది సమయానికి పూత వచ్చి దిగుబడి బాగుంటుందని ఆశించాం. అయితే డిసెంబర్‌లో వచ్చిన వర్షాలు పూత రావడంపై తీవ్రమైన ప్రభావం చూపించాయి. జనవరిలో తేనె మంచు వల్ల అరకొరగా వచ్చిన పూతను నల్లగా మారి రాలిపోతోంది. కనీసం 10 శాతం కూడా పూత నిలవడం లేదు. దీని ప్రభావం దిగుబడిపై ఉంటుంది. ఈ ఏడాది ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.– సుబ్రమణ్యం, రైతు, దుర్గసముద్రం, తిరుపతి రూరల్

మందులు వాడాలి



పలు ప్రాంతాల్లో మామిడి పూత రావడం ఆలస్యమవుతోంది. పూత దాని పక్షంలో 13-0-45 రసాయన ఎరువు 10 గ్రాములు, 3 గ్రాముల సల్ఫర్, 1.6 ఎంఎల్ మోనోక్రోటోపాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీంతో పాటు పూత రాని తోటల్లో పొగపెట్టాలి. పూత వచ్చిన తర్వాత చెట్లకు ఎరువులు వేసి తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి. చీడపీడల నివారణకు సీఎం, క్లోరోపైరిఫాస్ 2-ఎంఎల్, బోరాన్ ఒక గ్రామును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చి పూత ఉంటే ఇమిడాక్లోప్రిడ్ 0.3 గ్రాములు, హెర్లాకొనజోల్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. – దశరథరామిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి, తిరుపతి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.82,790
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,528
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.92,400
రిటైల్ వెండి గ్రాము	రూ.95.40

క్లుప్తంగా

గజ బీభత్సం



ఏనుగులు తొక్కేసిన వరి పైరు

చంద్రగిరి : మండలంలోని కొండ్రెడ్డికండ్రిగ, యల్లంపల్లెలో సోమవారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. సుమారు 12 ఏనుగులు గ్రామంలోకి చొరబడ్డాయి. సమీపంలోని అరటి, మామిడితోటలతోపాటు వరి పంటలను నాశనం చేశాయి. గజరాజుల ఘీంకారంతో గ్రామస్తులు వణికిపోయారు. నీటి పైపులను ధ్వంసం చేశాయి. ఇటీవల ఏనుగుల దాడిలో కందులవారిపల్లె ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి మృతి చెందిన విషయం విధితమే. ఆ ఘటన మరువకముందే మరోసారి ఏనుగులు హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళన చెందారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మరో ప్రాణం బలికాకముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పెన్షనర్ల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

వాకాడు : మండలంలోని పలు గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ.15వేల పెన్షన్ పొందుతున్నవారిని వైద్యుల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ అన్నపూర్ణారావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 12 మంది దీర్ఘకాలిక రోగాల బారిన పడి పింఛన్ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈమేరకు వారిని ఆరోగ్యస్థితిగతులను పరిశీలించి, నివేదిక రూపొందించినట్లు వివరించారు.

జీఎస్ఎల్‌వీ ఎఫ్15 కౌంట్‌డౌన్

- షార్ నుంచి నేడు ప్రయోగం
- నావిక్ సిరీస్‌లో రెండో ఉపగ్రహం


సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి బుధవారం ఉదయం జీఎస్ఎల్‌వీ ఎఫ్15 రాకెట్ నింగికి పయనంకానుంది. ఇస్రో నుంచి ఇది వందో ప్రయోగం కావడంతో చరిత్ర పుటల్లోకి ఎక్కనుంది. శ్రీహరికోటను రాకెట్ కేంద్రంగా 1969లో గుర్తించినప్పటికీ అక్కడ అన్ని ఏర్పాట్లు చేసుకోవడానికి పదేళ్లు సమయం పట్టింది. అప్పటి దాకా సూళ్లూరుపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా వున్న బ్రిటీస్ వారు నిర్మించిన భవనంలో ఇస్రో కార్యాలయం నడిచింది. 1979 ఆగస్టు 19న ఎస్ఎల్‌వీ డీ1 అనే చిన్న తరహా రాకెట్‌ను రూపొందించి అందులో 40 కిలోల బరువు కలిగిన రోహిణి–1 ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా వున్న లియో అర్బిట్‌లోకి పంపించింది. ఈ సిరీస్‌లో 4 ప్రయోగాలు చేపట్టింది. 1987 మార్చి 24న ఏఎస్ఎల్‌వీ డీ1 రాకెట్‌లో 150 కిలోల బరువు కలిగిన స్రాస్–1 ఉపగ్రహాన్ని రోదశీలోకి పంపింది.



శ్రీహరికోటలో తొలినాళ్లలో సైకిల్ మీద రాకెట్‌ను తీసుకెళుతున్న దృశ్యం (ఫైల్)




ఎద్దులబండిలో ఉపగ్రహం తీసుకెళుతున్న దృశ్యం (ఫైల్)



సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా బ్రిటీష్ వారు నిర్మించిన భవనమే ఇస్రో తొలి కార్యాలయం (ఫైల్)

- ఈ రెండు తరహా రాకెట్లను ఘన ఇంధన దశలతోనే నిర్వహించారు. అయితే అత్యంత బరువైన ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకెళ్లాలంటే ఘన, ద్రవ ఇంధనం దశలతో కూడిన రాకెట్ అవసరాన్ని గుర్తించారు. దీనికి ఆనాటి శాస్త్రవేత్తలు నంబి నారాయణన్, శ్రీనివాసన్, మాధవన్‌నాయర్ లాంటి వారు ఈ టెక్నాలజీని తీసుకొచ్చి పీఎస్ఎల్‌వీ రాకెట్‌ను రూపొందించారు.
- 1993 సెప్టెంబర్ 20న పీఎస్ఎల్‌వీ డీ1 రాకెట్‌లో 1400 కిలోల బరువు కలిగిన ఉపగ్రహాన్ని ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు. 44 మీటర్లు పొడవు, ప్రయోగసమయంలో 295 టన్నుల బరువుతో ప్రయోగించారు. ఈ రాకెట్ సిరీస్‌లోనే 62 ప్రయోగాలు చేశారు.
- ఇంకా అత్యంత బరువు కలిగిన ఉపగ్రహాలను పంపాలంటే క్రయోజనిక్ ఇంజిన్‌లతో చేయాలని రష్యానుంచి 6 ఇంజిన్‌లను తెచ్చుకున్నారు. అందులో ఒక్క ఇంజిన్‌ను మోడల్‌గా చేసుకుని పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోజనిక్ దశను రూపొందించి జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగాల జోరు పెంచారు.
- 2001 ఏప్రిల్ 18 జీఎస్ఎల్‌వీ డీ1 రాకెట్ ద్వారా 2000 వేలు కిలోలు బరువు కలిగిన జీశాట్–1 ఉనే ప్రయోగ్రహాన్ని భూమికి 36 కిలో మీటర్లు ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. 49 మీటర్లు పొడవు కలిగి 414 టన్నుల బరువుతో ప్రయోగించారు. ఈ సిరీస్‌లో 16 ప్రయోగాచేసి 17వ ప్రయోగాన్ని చేసేందుకు బుధవారం సర్వం సిద్ధం చేశారు.



ఇస్రో ప్రయోగించనున్న రాకెట్ల వివరాల పట్టిక

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని ఇస్రో చైర్మన్ నారాయణన్ దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

చెంగాలమ్మ సేవలో..



చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్ నారాయణన్ తదితరులు

జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ మంగళవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ షార్‌లో మూడో ప్రయోగవేదికను అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కౌంట్‌డౌన్ ప్రక్రియ సజావుగా సాగుతోందన్నారు. నావిక్–2 పేరుతో రెండో ఉపగ్రహాన్ని పంపిస్తున్నామని వివరించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



ధ్వంసమైన వ్యాన్(ఇన్‌సెట్) మృతి చెందిన వెంకటేష్ (ఫైల్)



కైలాష్ ప్రదాన్ మృతదేహం

చంద్రగిరి/ చిల్లకూరు : జిల్లాలోని వేర్వేరు చోట్ల మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. చిత్తూరు నుంచి తిరుపతి వైపుగా కోళ్ల లోడుతో వస్తున్న వ్యాను మామండూరు వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రాపురం మండలం కూనేపల్లెకు చెందిన క్లీనర్ వెంకటేష్ మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. వ్యాన్ డ్రైవరు షణ్ముగం అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే చిల్లకూరు మండలంలో ముత్యాలపాడు పంచాయతీ రైటారసత్రం వద్ద ఉన్న అపెక్స్ బూట్ల పరిశ్రమలో పని చేసే ఒడిశాకు చెందిన కార్మికుడు కైలాష ప్రదాన్ (48) కారు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సూపర్ సిక్స్ పేరుతో మోసం



విలేకర్లతో మాట్లాడుతున్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ నేతలు

- ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి

పెళ్లకూరు: ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. మంగళవారం చిల్లకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వృద్ధి రేటు 15 శాతం వచ్చే వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చెప్పడం దారుణమన్నారు. సంపద సృష్టిస్తాం, అందరికీ పథకాలు అందిస్తామని ఊదరగొట్టి, ఇప్పుడు చేతులెత్తేయడం నయవంచన అని విమర్శించారు. గతంలో ధాన్యం ధర రూ.2,400 ఉండేదని, ఇప్పుడు రూ.1,400 పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రజావ్యతిరేక పాలనపై జెడ్పీటీసీ సభ్యులు ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి చేపట్టిన పోరుబాటను స్థానిక టీడీపీ నేతలు విమర్శించడం సరికాదని మండిపడ్డారు. కిలివేటి సంజీవయ్య నేతృత్వంలో సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇసుక, గ్రావెల్, మట్టి దోచుకుంటున్న కూటమి నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, నేతలు కరణం రఘునాయుడు, ఎల్లు మోహన్, కృష్ణయ్య, బాలసుబ్రమణ్యం, బాలు, జితేంద్ర, బాలాజీ, మునిరాజా, అశోక్, ఆనంద్ పాల్గొన్నారు.

తిరుమలలో అన్నీ అపచారాలే



ట్రాక్ ప్యాంట్, టీ షర్ట్‌తో బ్రేక్ దర్శనానికి వెళ్లి వస్తున్న భక్తురాలి చిత్రం చూపిస్తున్న భూమన తదితరులు

- టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన ఆగ్రహం

తిరుపతి మంగళం : కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమలలో అన్నీ అపచారాలే జరుగుతున్నాయని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. శ్రీవారి బ్రేక్ దర్శనానికి సాంప్రదాయ దుస్తులతో వెళ్లాలనే నిబంధనలకు టీటీడీ అధికారులు తిలోదకాలు ఇచ్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విజిలెన్స్ నిర్లక్ష్యం కారణంగా సోమవారం కొందరు ట్రాక్ ప్యాంట్, టీషర్ట్ ధరించి శ్రీవారి బ్రేక్ దర్శనానికి వెళ్లారని విమర్శించారు. అదనపు వెంకయ్యచౌదరి నిత్యం చంద్రబాబు సేవలో మునిగిపోయి తిరుమలను భ్రష్టుపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల సమయంలో తొక్కిసలాట జరిగిందన్నారు. విజిలెన్స్ వైఫల్యంతోనే కొండకు మద్యం, మాంసం తీసుకువస్తున్నారని ఆరోపించారు. శ్రీవారి ఆలయం ఎదుట బిరియానీ, కోడిగుడ్లు తీసుకువచ్చి తిన్నారంటేనే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో తెలుస్తోందని విమర్శించారు. తిరుమలలో నాలుగు పర్యాయాలు ఎర్రచందనం పట్టుబడిందని, దీన్ని బట్టి చూస్తే ఉగ్రవాదులు మారణాయుధాలు తీసుకెళ్లినా పట్టించుకునేవారు లేరని స్పష్టంగా అర్థమవుతోందని మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ జోక్యం చేసుకుందంటే తిరుమల పవిత్రతను ఎంతగా దిగజార్చారో అర్థమవుతోందని తెలిపారు. సనాతన ధర్మం అంటూ ప్రగల్భాలు పలికిన పవన్‌స్వామి ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా టీటీడీ పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మేయర్ శిరీష, కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, రామస్వామి వెంకటేశ్వర్లు, నేతలు మల్లం రవిచంద్రారెడ్డి, బొమ్మగుంట రవి, నల్లాని బాబు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి



గేదెల కళేబరాలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చిన్నకనపర్తి గ్రామంలో విద్యుదాఘాతంలో నాలుగు గేదెలు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దకనపర్తి దళితవాడకు చెందిన పల్లమాల రమణయ్య గేదెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో తన 8 పశువులను మేతకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి నాలుగు కనిపించలేదు. ఎంత వెతికినా జాడ తెలియలేదు. మంగళవారం ఉదయం చిన్నకనపర్తి గ్రామానికి చెందిన చెరుకూరి వాసునాయుడు పొలంలో గేదెల కళేబరాలు కనిపించాయి. వాసునాయుడు తన పొలం చుట్టూ వేసిన విద్యుత్ ఫెన్సింగ్ తగిలి గేదెలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో కూడా వాసునాయుడు నిర్వాకం వల్లే చేమూరు వెంకటరామయ్యకు చెందిన మూడు గేదెలు మృతి చెందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

చంద్రగిరి: మండలంలోని తొండవాడలో గోపి (49) అనే వ్యక్తి మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వివరాలు.. వ్యవసాయ బోరు మోటార్లు, స్టార్టర్లకు మరమ్మతులు చేస్తూ గోపి జీవనం సాగించేవాడు. ఓ రైతు పొలం వద్ద బోరు మోటారుకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఎర్రదొంగ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న కొంతమంది స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. అందులో ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ టి. విష్ణువర్ధన్ కుమార్ టీమ్, స్థానిక ఎఫ్‌బీఓ జీ.అనిల్ కుమార్ సహకారంతో కూంబింగ్ చేపట్టారు. జాండ్రపెంట ఫారెస్టు బీటు పరిధిలో కొరతుకోన వద్ద కొందరు వ్యక్తులు అడవిలోకి చొరబడుతుండగా చుట్టుముట్టారు. వారిలో అందరూ పారిపోగా ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. నిందితుడిని తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జైలు



పోలీసు అదుపులో నిందితుడు

నారాయణవనం: మండలంలోని మిట్ట నైనారుకండ్రిగకు చెందిన మునివేలు(42)పై హత్యా నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానాను జిల్లా పదో అదనపు కోర్టు జడ్జి విధించినట్లు సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. వివరాలు.. మునివేలు భార్యతో అదే గ్రామానికి చెందిన షణ్ముగం ఆచ్చారితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మునివేలు 2018 ఆగస్టు 30వ తేదీన షణ్ముగం ఆచ్చారిని కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

నా మాటే శాసనం!



వేలం పాటలో ఆలయ ఈఓ పక్కనే కూర్చున అధికారపార్టీ నేత (ఫైల్)

- ముత్యాలమ్మ ఆలయంలో టీడీపీ నేత రుబాబు
- కాబోయే చైర్మన్ నేనే అంటూ పెత్తనం

చిల్లకూరు : అధికారమే అండగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇందుకు తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఓ టీడీపీ నేత దాదాగిరీనే నిదర్శనంగా నిలుస్తోంది. ఆలయ పాలకమండలి పదివీ కాలం మార్చి నెలాఖరు వరకు ఉంది. అయితే కోట మండలానికి చెందిన టీడీపీ నేత తనకే ఈ పర్యాయం ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవి దక్కుతుందని ప్రచారం చేసుకుంటున్నారు. అక్కడితో ఆగకుండా ఇప్పటి నుంచి ఆలయంలో పెత్తనం చెలాయిస్తున్నారు. పాలకమండలి సమావేశంలో దర్జాగా కూర్చుంటున్నారు. తన మాటే వినాలని అధికారులను బెదిరిస్తున్నారు. తాను చెప్పిన వారికే పనులు కట్టబెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. అందులో భాగంగా నాలుగు రోజుల క్రితం ముత్యాలమ్మ జాతర సందర్భంగా చేపట్టిన వేలం పాటలను ఆయనే నియంత్రించారు. వేదికపై కూర్చుని అందరినీ భయాందోళనకు గురిచేస్తూ తనకు అనుకూలమైన వారికి వేలం పాట దక్కలేదని దౌర్జన్యానికి దిగారు. వేలం పాట నిలిపేయాలని హల్‌చల్ చేశారు. దీంతో ఆగ్రహించిన పాలకమండలి సభ్యుడు ఒకరు ప్రశ్నించగా సదరు అధికారపార్టీ నేత నానా హంగామా సృష్టించారు. ఇంత జరుగుతున్నా ఆలయ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం. స్థానిక ప్రజాప్రతినిధి అండతోనే ఆ నేత రెచ్చిపోతున్నట్లు వేలం పాటకు హాజరైన వారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబును వివరణ కోరగా.. వేలం పాట మొదలైన తర్వాత వెళ్లిపోయానని తెలిపారు. విషయం తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

కూతురే కొడుకై..



వెంకటయ్య మృతదేహం



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ధరణి

వెంకటగిరి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నిడిగంటి వెంకటయ్య గుండెపోటుతో సోమవారం కన్నుమూసిన విషయం విధితమే. మంగళవారం బాలాయపల్లె మండలం తాళ్లపల్లెలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అయితే వెంకటయ్య కుమార్తె ధరణి అన్నీ తానై దహన సంస్కారాలు జరిపించారు.. కుమారుడి స్థానంలో నిలిచి తండ్రికి కన్నీటి వీడ్కోలు పలికారు. వెంకటయ్యకు భార్య లతతోపాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ధరణి చివరి బిడ్డ కావడం గమనార్హం. వెంకటగిరి సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు అధికార లాంఛనాలతో వెంకటయ్యకు నివాళులర్పించారు. – వెంకటగిరిరూరల్